# నేను మీకోసం

## రసరాజు

టాంక్‌బండ్ మీద నిలబడి హుస్సేన్ సాగర్ లోకి చూస్తోన్న ఉపేంద్ర భుజం మీద చెయ్యి పడటంతో ఉలిక్కి తిరిగి చూశాడు.

చక్రవర్తి, అతని ప్రక్కనే ఒక అందమైన అమ్మాయి ...

బహుశా అతని భార్య అయ్యుండొచ్చు

"రోజూ చూస్తున్నా — సాగర్ కొత్తగానే కనిపిస్తోందా ఉపేన్ ..."

ఉపేంద్ర బదులు పలకలేదు. చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

"ఈమె సరళ."

"నమస్తే ..."

ప్రత్యభివాదం చేశాడు ఉపేంద్ర.

"... నా మిసెస్."

"నేనో అలా అంటే ఒప్పుకోను ... మిసెస్ కాదు"

"మరి ..." — వాళ్ళ కళ్ళు సందిగ్ధంగా కదిలాయి.

"మిసెస్ కాదు — బెటర్ హాఫ్ ..."

ఉపేంద్ర చమత్కారానికి చక్రవర్తి, సరళ సన్నగా నవ్వుకొన్నారు.

చక్రవర్తి — ఉపేంద్రను కూడ సరళకి పరిచయం చేసి ముందుకు నడిచాడు.

ఉపేంద్ర— చక్రవర్తినీ, చక్రవర్తి భార్యనీ అలా చూస్తూ ఉండిపోయాడు.

"... సరళ ఎంత మోడ్రన్‌గా ఉంది"

ఒక చేతికి గాజులు లేవు — వాచీ తప్ప ...

ఏ చీర కట్టుకుందో — అదే రంగు బొట్టు— అదే రకం గాజులు...

వాజూగ్గా వదిలేసిన జడ ...

వీ నెక్ జాకెట్ ...

ఇంకా ... ఇంకా ...

ఓ స్నేహితుడి భార్యను అంత పరిశీలనగా చూడటమా ... నాన్‌సెన్స్!

...దృష్టి మార్చి — అటువేపు చూశాడు

దూరంగా పవర్ హౌస్ పొగగొట్టం — వేడివేడి నల్లటి పొగల్ని కక్కుతోంది.

సిగరెట్ వెలిగించి ముందుకు నడిచాడు.

ఒక చోట ఆగి — మళ్ళీ సాగర్ లోకి చూడటం మొదలు పెట్టాడు. అలా చూడటం అతని కో సరదా.

"...బ గుంది కద్రా."

"ముఖంలో శ్రద్ధా గ్లామర్. ఆ చీర చూడు ఎంత బొడ్డుకిందికి కట్టిందో ..."

ఉపేంద్ర కళ్ళు సాగర్‌లోంచి ఎగిరి, పక్కనున్న బెంచి మీదికి వాలాయి.

ఆ బెంచీమీద ముగ్గురు కుర్రాళ్ళు కూర్చు న్నారు.

మరి కాస్త దూరంలో చక్రవర్తి, చక్రవర్తి భార్య సరళ ...

ఉపేంద్ర అక్కడే నిలబడి వాళ్ళ మాటల్ని వింటున్నాడు.

"ఫిగర్ ప్రొఫైల్ ఎవరికి కాస్ అంటావు, గురూ ..."

"ఏదీ చూశావుగాని— ఒనెక్ చూడ్రా పిచ్చిసన్నాసి."

"కాపరాన్ని కేవ గాని గురూ — క్లబ్బులోకి మాత్రం బాగా పనిచేస్తుంది ..."

"ఆ కట్టూ బొట్టూ, వేషం, ఫిగర్ పిచ్చగా ఉంటుంకో!"

"గులు దెంగలోగాని మ. చి చాన్సే కొట్టాడ్రా..."

"సెపరేషన్ చేసేస్తానో ..."

"... ..."

ఉపేంద్ర మనసు ఒక్కసారిగా వికలమై పోయింది. వాళ్ళాడిన ఒకో మాట ఒకో శకలంలా గుండెల్ని కాల్చిపారేసింది.

మనసులో శమంత లీలగా మెదిలింది...

ఉపేంద్రకు — ఆ నిమిషంలో ఇంటికి వెళ్ళి పోవాలనిపించింది.

సిటీ బస్ ఎక్కి కూర్చున్నాడు.

బస్సులో కూర్చున్న కాస్సేపట్లోనే ఎన్నో ఆలోచనలు అతన్ని చుట్టుముట్టాయి.

శమంత— కీర్తి కిరీటాన్ని ధరించిన "..."లా కనిపించింది.

బస్సు దిగగానే క్లాత్ సెంటర్‌కి నడిచాడు.

ఖరీదైన చీరని ఎన్నికచేసి పేక్ చేయించాడు.

స్వీట్ మార్ట్ దగ్గరాగి— రకరకాల స్వీట్సన్నీ కలిపిన ఒక బాక్స్ తీసుకున్నాడు.

మల్లెలూ— కనకాంబరాలూ కొన్నాడు.

రెండు కిళ్ళీలు కట్టించి ఇంటివేపు నడిచాడు.

* * *

శమంత ఇంకా నిద్ర పోలేదు.

చాతీమీద పేజీలు తెరచిన పుస్తకం—శమంత హృదయాన్ని చదువుతోంది.

ఇద్దరు పిల్లలూ— చెరో మంచం మీద పడు కొన్నారు.

ఉపేంద్ర మాటాడకుండా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

శమంత ఉలిక్కిపడి లేచింది!

"స్నానానికి నీళ్ళు తోడమంటారా?"

"వూ !"

శమంత ఆశ్చర్యపోయింది. ఉపేంద్ర నుండి ఆ కొంచెం సమాధానం కూడ వస్తుందని తను అనుకోలేదు.

ఉపేంద్ర స్నానం చేసి వచ్చి, లుంగీ చుట్టుకొం టోండగా "భోజనం వడ్డిస్తున్నాను" అంది.

"ఏం కూర."

ఇది సమంత వూహించని సమాధానం.

"పెరుగు పచ్చడి, కాకరకాయ ఫ్రయ్ ..."

ఉపేంద్రకు అవి రెండూ అంటే చాలా ఇష్టం.

"నువ్వు తిన్నావా ..."

శమంతకు ఈ మాటతో పూర్తిగా బుర్ర తిరిగిపోయింది. "లేదు." అని చెప్పి, వంటింట్లోకి నడిచింది.

... భోజనం చేశాక ఉపేంద్ర పాకెట్సన్నీ శమంత చేతిలో ఉంచి — బెడ్ రూమ్ లోకి నడిచాడు.

శమంత — ఈ హటాత్పరిణామానికి నివ్వెర పోతూ, ఒకో పాకెట్టూ విప్పిచూసింది.

చీర — వెరీ లేటెస్ట్ డిజైన్‌లో కొట్టొచ్చి నట్లుంది ...

ఆ వెనుక — మల్లెలూ, కనకాంబ రాలూ ...

స్వీట్స్ ...

రెండు కిళ్ళీలు ...

శమంతకు అంతా అయోమయంగా తోచింది.

మేనులో వడగళ్ళు ఏరుకొన్నట్టుగా ఉంది.

ఆలోచిస్తూ బాత్‌రూమ్‌లోకి నడిచింది.

... స్నానం చేస్తున్నంతసేపూ ఉపేంద్ర ప్రవ ర్తన మీదే మనసు పనిచేస్తూ వచ్చింది.

అసలు ఉపేంద్ర ఎప్పుడూ — ఈ పద్ధతిలో ఇంటికి రాలేదు. ఎన్నోసార్లు ఆ ఒక్క విషయం మీదే ఇద్దరి మధ్యా అభిప్రాయభేదా లొచ్చాయి.

ఉపేంద్ర కోపగించి అన్నం తినకుండా వెళ్ళి పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. లా ఎప్పుడు కోపంగా వెళ్ళినా హోటల్లో భోంచేసి ఏ రాత్రి రెండు గంటలకో ఇంటికొచ్చి మాటామంతీలేకుండా సీరియస్‌గా మంచం మీద వాలిపోవడం రివాజు. ఒక వేళ తను పలకరించినా — అటువేపు నుంచి సమాధానం ఉండేది కాదు!

అలా ఉండవల్సిందే. ఈ రోజు కూడ ...

మరి ...

ఉపేంద్రలో ఈ వింత మార్పుకు కారణం ఏమిటో తనకు బోధపడలేదు.

తనకీ — ఉపేంద్రకీ — కొన్ని గంటల ముందు ఎంత ఘర్షణ జరిగింది? ... తను ఎంత నిష్కర్షగా

మాట్లాడింది.

ఉపేంద్ర — ఎంత దురుసుగా మాట్లాడి బయటికి వెళ్ళిపోయాడు.

అయితే ఏ రాత్రికైనా — ఉపేంద్ర తిరిగి వచ్చే స్వభావమని తనకు బాగా తెలుసు!

కాని, వాతావరణం ఇంత చల్లగా ఉంటుందని తను కలలో కూడ వూహించలేదు.

తొమ్మిది గంటలకే ఇంటికి రావడం —

ఇన్ని పూలూ — ఖరీదైన చీరతో — ఇంటిని "స్వీట్‌హోమ్"గా మార్చేస్తూ మరీ రావడం —

తనను ఒక్కసారిగా ఆశ్చర్యంలో ముంచేసింది.

ఉపేంద్రమీద ఎందుకో జాలి కలిగింది. ఆ నిమిషంలో. అనురాగం అనంత సముద్రంలా పొంగి పొర్లింది — ఆ క్షణంలో ...

శమంత తృప్తిగా భోజనంచేసి అద్దం ముందు నిలబడింది.

* * *

ఉపేంద్ర చదువుతోన్న పుస్తకాన్ని బల్లమీద వుంచి, ఎదురుగా చూశాడు.

శమంత ...

రతీ దేవిలా ఉంది.

కొత్త చీరలో — కుందనపు బొమ్మలా ఉంది.

వెరైటీ హెయిర్ స్టయిల్ ...

అక్కడక్కడ కనకాంబరాలూ, మల్లెలూ సిగ్గుగా నవ్వుతున్నాయి. పెదాలు ఎరుపెక్కి ఉన్నాయి కిళ్ళీ రంగుతో.

ఉపేంద్ర ఎప్పుడోగాని కిళ్ళీ వేసుకోడు. మనసు పడితేనే తప్ప.

శమంత దగ్గిరికొచ్చి — ఉపేంద్ర నోటికి కిళ్ళీ అందించింది. ఉపేంద్ర వేలు కొరకలేదు.

కాలి బొటన వ్రేలితో శమంత కాలి బొటన వ్రేలిని తొక్కాడు.

"ఈ చీర బావుందికదూ! ..." సరళను తలదన్నేలా సెక్సీగా కట్టిన చీరనీ, కడుపు పక్క అందంగా ఏర్పడ్డ ముడతల్నీ చూస్తూ అన్నాడు ఉపేంద్ర.

శమంత కొంటెగా చూసింది — ఆ చూపుల్ని వారిస్తూ.

ఆ చూపులు — ఉపేంద్రని మరింత రెచ్చగొట్టాయి. శమంతను ఒళ్ళోకి తీసుకున్నాడు.

సరళ కట్టూ బొట్టూ కంటే శమంత వేషం తక్కువ ఏమీ కాదు. ఆమె కంటే — రొమాంటిక్ హిరోయిన్‌లా — వెయ్యిరెట్లు గ్లామర్‌గా ఉంది శమంత.

"...శయనేషు రంభ" గుర్తుకొచ్చింది.

ఉపేంద్ర — ట్యూబ్‌లైట్ డిమ్ చేసి— బెడ్ లైట్ వెలిగించాడు.

... ... ...


ఉపేంద్ర మనస్సు — కొన్ని గంటలు వెనక్కి వెళ్ళి — జ్ఞాపకాన్ని తవ్వుకొంది.

* * *

రెడ్‌హిల్స్‌లో — ఆ మధ్యాహ్నం— బాస్ ఇంట్లో ఫంక్షన్ ... బాస్ — విధిగా అందర్నీ ఫామిలీతో రావర్సిందిగా కోరాడు.

ఉపేంద్ర ఉదయమే ఆఫీసుకొస్తూ —శమంతను డైరెక్ట్‌గా ఫంక్షన్‌కు వచ్చేయమని ఆర్డర్






జారిచేశాడు.

శమంత — అలాగే అనుకొన్న సమయానికి ఆటో దిగింది.

ఆఫీస్ స్టాఫ్ అప్పటికే చాలా మంది ఫామిలీతో వచ్చి కూర్చున్నారు.

ముఖ్యంగా ఉపేంద్ర మిత్రులు — రఘు, సుబ్బారావు, విజయ్, సారథి, మస్తాన్‌రావు — సతీ సమేతంగా వచ్చారు.

ఎంత లవ్లీగా ఉన్నారు వాళ్ళ భార్యలు ...

ఆ అలంకరణ చూస్తోంటే — మనసు చెదిరిపోతోంది.

శమంత వచ్చింది ఎందుకు? ...

ధర్మవరం పట్టుచీర శరీరం కనబడకుండా కట్టుకొంది. రూపాయి బిళ్ళంత కుంకుమ బొట్టు ఎర్రగా నుదుటి భాగాన్పై దిద్దుకొంది. అతి సామాన్యంగా జడవేసుకొంది. కట్టూ బొట్టూలో ఎక్కడా ఆకర్షణలేకుండా, ఏభై ఏళ్ళు నిండిన ముత్తయిదువలా బాస్ ఇంట్లో అడుగుపెట్టింది శమంత.

అలా వచ్చిన శమంతను చూడగానే — ఉపేంద్రకి తేళ్ళూ, జెర్రులలా పాకాయి.

నిరాడంబరంగా వచ్చిన శమంతను మిత్రులకు పరిచయం చేయడం తప్పింది కాదు ఉపేంద్రకు.

సుబ్బారావు, విజయ్ భార్యలకు శమంతను పరిచయం చేసినప్పుడు — వాళ్ళేదో ఉదాసీనంగా చూశారని — ఉపేంద్ర తల పట్టేసుకున్నాడు.

" ... మా శ్రీమతా!" అన్న సారథి భార్య కళ్ళల్లో ఆశ్చర్యంగా తొంగి చూసినప్పుడు— ఉపేంద్ర నిలువునా నీరయిపోయాడు.

" ... ఉపేంద్ర భార్య వయసులో చాలా పెద్దావిడలా కనిపిస్తోంది!" అని ఒకళ్ళిద్దరు అనుకొంటున్నప్పుడు ఉపేంద్ర మెలికలు తిరిగిపోయాడు.

బాస్‌కి పరిచయం చేసినప్పుడు కూడ "పాపం ... ఈ కాలపు పిల్లకాగు ఉపేన్ భార్య ... పెద్ద మనిషి తరహా!" — అని బాస్ ఎంతో గౌరవంగా అన్నప్పటికీ ఉపేంద్ర ఆ గౌరవాన్ని సంతోషంగా రిసీవ్ చేసుకోలేకపోయాడు.

అసలు ఉపేంద్ర మొట్టమొదట్నుంచీ సెన్సిటివ్. ఉపేంద్ర అక్కడో నిమిషం కూడ ఉండలేకపోయాడు. ఫంక్షన్ అయిన వెంటనే — ఆటోని పిలిచి — ఇంటి ముందు వాలిపోయాడు. ఉపేంద్రతో శమంత లోపలి కొచ్చింది.

వచ్చిన రెండు నిమిషాల వరకు — గదిలో భయంకరమైన నిశ్శబ్దం రాజ్యం చేసింది.

శమంత ఉపేంద్ర మనస్థితిని అర్థం చేసుకొంది.

"... ..."

"మీ రనుకొనే ప్రిస్టేజి — నావల్లపోతోందని మీరు అభిప్రాయపడితే నేనేం చేయలేను ..."

"అంటే నీ అభిప్రాయం నువ్వు మార్చుకోవన్న మాట."

"ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి! నా అభిప్రాయాన్ని మార్చుకొని నన్ను నేను చంపుకోలేను."

"నిన్ను నువ్వు చంపుకోలేవు ... నిజమే ... నన్నుమాత్రం చిత్రవధ చేస్తావు!"

"ఆ మాట నే ననాలి — మీ రంటున్నారు..."

"... ఎక్కడికైనా కలిసి వెళ్దామంటే భయం. మామ్మలా తయారవుతావ్! కాస్త నాజూగ్గా ఉండమని, బాగా కనపడాలని లక్షసార్లు చెప్పాను ... నా స్నేహితుల ముందు, వాళ్ళ భార్యల ముందు ఎంత చిన్నతనం ఫీలవుతున్నానో నీకేం తెల్సు? ... వాళ్ళందరూ నీలాంటి ఇల్లాళ్ళు కారా? ఎంత మోడ్రన్‌గా ఉంటున్నారు!...ఆ కట్టూ బొట్టూ ఎంత అందంగా ఎట్రాక్టివ్‌గా ఉంటోంది!"

"అదే మీకు చెబుతున్నాను. ఆడదాని అందం, ఆకర్షణ భర్త పరిధుల్లోనే ఉండాలి గాని— అది రోడ్డున పడితే మిగిలేది ట్రాజిడీ! ... మీ మట్టుకి మీరు చెప్పండి! మీ రూహించిన రీతిలో ఆడది బజార్లో నడిస్తే — మీ కళ్ళు ఎలా చూస్తాయి? మీ స్నేహితుల భార్యల్ని — ఫంక్షన్‌లో మీ రెలా చూశారు? ఏ స్త్రీనీ — ఉన్న అందాన్ని చంపుకొని అవాకారిగా ఉండమని నేను అనడం లేదు. లేనిపోని మెరుగులు దిద్దుకొని అసభ్యంగా రోడ్డున పడొద్దంటున్నాను. మీరు అనుకొనే ఆ సొంపులూ సొంపులూ భర్తను అలరించాలిగాని — బజారు జనాన్ని కాదు! ... కామాన్ని రెచ్చగొట్టే పిచ్చి పిచ్చి అలంకరణలు — చేసుకొన్న మగాడి ముందే వెలగబెట్టాలిగాని, పరాయి మగాడి ముందూ, రోడ్డు మీద కాల్చుకోవడం భారత స్త్రీ సంప్రదాయం కాదు! ... నా ఆశయాలు నావి! ... బయటి కొచ్చినప్పుడు ఎవరిలానో ఉండాలని దయచేసి ఇక నన్ను ఆదేశించకండి! ... నేను మీకోసం — అంతే! ... మీ అభిరుచుల మేరకు ఇంట్లో మీ దగ్గర ఎలా ఉండమంటే అలా ఉంటాను. నా కేమీ అభ్యంతరం లేదు. కాని, భర్త కళ్ళల్లోంచి తప్పుకున్నాక కూడా బజార్లో అలా మసలమంటే మసల్లేను. నావల్ల కాదు. ఇంతెందుకూ ... మీ స్నేహితులను కొంటున్న వాళ్ళ భార్యలకి ఒకే ఒక ప్రశ్న వేస్తున్నాను! పిచ్చెక్కింది — కామాన్ని రెచ్చగొట్టే ఈ అందాలు, అలంకరణలూ రోడ్డుమీద దెందుకు అని అడుగుతున్నాను ... ఎవరికోసం? దయచేసి వెళ్ళి అడగండి ... మరేం మాట్లాడకండి!" శమంత బుగ్గలు గులాబీల్లా ఎరుపెక్కిపోయాయి.

ఎర్రబారిన ముఖంతో మంచంమీది కెళ్ళి వాలిపోయింది.

ఉపేంద్ర కోపంతో టాంక్‌బండ్ మీది కొచ్చేశాడు.

ఉపేంద్ర తెగిన జ్ఞాపకాల్లోంచి బయటపడి— శమంతను చూశాడు.

ఒడిలో — అమాయకంగా నిద్రపోతోంది.

"నిజమే! ఆడదాని అందం, ఆకర్షణ భర్తవరకే పరిమితం కావాలిగాని, బయటపడితే మిగిలేది ట్రాజిడీ!'

టాంక్‌బండ్ దగ్గిర ఏమయింది? ...

ఎంత నీచంగా మాట్లాడారు ఆ ముగ్గురు కుర్రాళ్ళు ... సరళవేషం — అంత వెర్రితలలు వేయకపోతేనే .. సరళ అలా ఎగ్జిబిట్ కావడం — ఆ కుర్రాళ్ళు అసభ్యంగా మాట్లాడటం రెండూ తప్పే!

ఉపేంద్ర మనసులో భావి విప్లవం రేగింది.

శమంత మనసు — ఇప్పు డర్థమయింది తనకు! శమంత నిజంగా రూపవతే! ఆమె కూడా అలాగే శ్రుతిమించిన ఆడంబరాలకు, ఆకర్షణలకు పోతే — వచ్చే పరిణామాల్ని భర్తగా తను సహించగలిగి ఉండేవాడా! నో నో ... తను మరీ సెన్సిటివ్! ... శకుంతల అందం — ఆకర్షణ — తనవరకే పరిమితం కావాలి గాని బజారు పడకూడదు! పడితే సరళ కొచ్చిన కామెంట్సే తనూ వినాలి! తను వినలేడు! నిజంగా శమంత దేవత! ఇల్లు దాటినప్పుడు కనిపించే శమంతకీ — ఈ గదిలో తన ఒడిలో ఒదిగిన శమంతకీ ఎంత తేడా? ... అసలు ... శమంతని ఈ సమాజంలో ఎంతమంది అర్థం చేసుకోగలరు? ...

— భావ సంఘర్షణలోంచి తప్పుకొని, శమంతను చూశాడు ఉపేంద్ర.

అమాయకంగా ఒడిలో నిద్రపోతోంది. "నేను మీ కోసం" అన్నట్టుగా. ★